హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు, స్థానికులు

అల్లాపూర్, 14 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): 'లలితా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ' ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ సంయుక్తంగా నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా కూచిపూడి నృత్యాల ప్రదర్శన, దేశభక్తి గీతాలాపనలు మోతీనగర్ నలంద స్కూల్ వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నేత నలమాల్పు అంజిరెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగాను ఓ పండుగలా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో హేమారామస్వామి, వినూష, దేవిప్రియ, స్వరూప, తనూజ, అనూష, స్పందన పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఖాజాగూడ ప్రభుత్వ పాఠశాలలో పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి విద్యార్థులకు జాతీయ జెండాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరూ జాతీయ జెండాలను తమ ఇళ్లపై ఏర్పాటు చేసి దేశభక్తిని చాటాలన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు.



కుత్బుల్లాపూర్ వినాయకనగర్ లిటిల్ క్యాంపస్ స్కూల్లో జాతీయ జెండా రంగులతో చిన్నారులు.

- ఫొటోగ్రాఫర్ నాగేశ్వరరావు, ఆంధ్రజ్యోతి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

హైదర్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన 10 లక్షలా 19 వేలా 500 రూపాయల విలువ చేసే చెక్కులను 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు ఆస్పత్రి బిల్లుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 30 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో మేడ్చల్ జోన్ పరిధిలో పని చేస్తున్న పోలీస్ సిబ్బందితో అడిషనల్ డీసీపీ పురుషోత్తమ్ ఏసీపీలతో కలిసి నేర సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో ఎక్కువ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్‌ను తయారు చేసి నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేశారు.

కుత్బుల్లాపూర్ ఆర్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ

గాజులరామారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో ఈనెల 9న ముగ్గురు అధికారులు బదిలీపై వెళ్లారు. మేడిపల్లిలో పని చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాంకలీమ్, ఘట్‌కేసర్‌లో పని చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కుత్బుల్లాపూర్ మండల ఆర్‌ఐలుగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీరితో తహసీల్దార్ అబ్దుల్ రహీమ్ పలు సూచనలు చేశారు.

నిజాంపేట్, దుండిగల్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

నిజాంపేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపల్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను మండల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ మేరకు కమిషనర్ రంగనాథ్ ప్రగతినగర్‌లోని సర్వేనంబరు 134 ఎర్రకుంట చెరువు, నిజాంపేట్ స్ప్రింగ్‌కాలనీ ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాలను, మల్లంపేట్ కత్వచెరువును, గతంలో మల్లంపేట్‌లో సర్వే నంబరు 170/1లో వెలిసిన విల్లాలు, దొమ్మరపోచంపల్లిలోని కుడికుంట చెరువులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌తో కలిసి పరిశీలించారు. మల్లంపేటలోని పాత హైదరాబాద్ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, మల్లంపేట నుంచి బాచుపల్లి రెడ్డి ల్యాబ్ వరకు మాస్టర్ ప్లాన్ 100 ఫీట్ల రోడ్డును అమలు చేయాలని, అంజనేయులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.



వినతి పత్రాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

రోడ్డు కోసం తండావాసుల నిరసన

దుండిగల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు సరిగా లేదని తండావాసులు బుధవారం రోడెక్కారు. దుండిగల్ మున్సిపల్‌లోని దుండిగల్ తండా -2కు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. తమ సమస్యల గురించి నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని రోడ్డుపై నిరసన తెలిపారు. రోడ్డు విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా తమ గోడు పట్టడం లేదని తెలిపారు. దీంతో కాజీపల్లి ఫార్మాసిటీకి వెళ్లవలసిన బస్సులు, ఉద్యోగులు గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.



తండాలో నిలిచిపోయిన వాహనదారులు

'వీధి వ్యాపారులను వేధించొద్దు'

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలో వీధి వ్యాపారులను కాంగ్రెస్ నాయకులు వేధిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రైతుబజార్, తహసీల్దార్ కార్యాలయం మార్గాల్లో 30 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న వారిని స్థానిక కాంగ్రెస్ నాయకుల మాటలు విని ఆ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తొలగించేలా చేశారని తెలిపారు. పూలు, పండ్లు అమ్ముకునే వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.

పేద విద్యార్థులకు బ్యాగులు, పెన్నుల పంపిణీ

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేటర్ సబీహబేగం బ్యాగులు, పెన్నుల కిట్ల పంపిణీ బుధవారం చేశారు. రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల, అల్లాపూర్ ఉర్దు మీడియం పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో బ్యాగుల, పెన్నులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, జాహెద్ షరీఫ్, అస్లాం సయద్, రేణుక పాల్గొన్నారు.

నేడు కూకట్‌పల్లి కోర్టు సముదాయం ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులతో నిర్మించిన కూకట్‌పల్లి కోర్టు సముదాయం ప్రారంభానికి సిద్ధమైంది. సుమారు రూ.43 కోట్ల వ్యయంతో రెండు భవనాలను ఐదు ఎకరాల స్థలంలో కైత్లాపూర్, అంబేద్కర్‌నగర్ మధ్యలో సర్వే నంబర్ 972లో వీటిని నిర్మించారు. మొత్తం 14 కోర్టులు ఉండగా.. వీటిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి తొమ్మిది, రంగారెడ్డి జిల్లాకు ఐదు కేటాయించారు. ఆగస్టు 15న ఉదయం 11.30 గంటలకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. 2006లోనే కూకట్‌పల్లికి కోర్టు కేటాయించినప్పటికీ మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగించారు. నూతన భవనం అందుబాటులోకి వస్తుండటంతో కబ్జాదారుల నుంచి కాపాడి కోర్టు నిర్మాణం వరకు అయ్యేలా కృషి చేసిన అప్పటి కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అర్కపల్లి ప్రకాశరావు కృషిని గుర్తుచేసుకొన్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల జడ్జిలతో పాటు కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గోవర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారు. కోర్టు ప్రారంభం నేపథ్యంలో పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో టెంట్ హౌస్ సామగ్రితో డెకరేట్ చేశారు.



ప్రారంభానికి సిద్ధమైన కోర్టు భవనం



కార్యక్రమంలో టీహబ్, స్టార్టప్ ప్రతినిధులు

20 స్టార్టప్‌లను ఎంపిక చేసిన ఏఐసీ టీహబ్

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఏఐసీ టీహబ్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో ఏఐసీ టీహబ్ పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి స్టార్టప్ దరఖాస్తులను ఆహ్వానించింది. 220 మంది దరఖాస్తులు రాగా వాటిలో 20 స్టార్టప్‌లను ఎంపిక చేయడం జరిగిందని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఎంచుకున్న స్టార్టప్‌లలో ఎర్త్‌టెక్ ఇండియా, అంబియేటర్ ప్రైవేట్ లిమిటెడ్, హుబెక్ గ్రీన్ వెంచర్స్ లిమిటెడ్, రెవరెంట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, షెప్లాన్ 8, షీన్ సోలార్, జీరో కార్బన్‌వన్, నెట్‌జీరో లివింగ్, విసార్డ్‌సిస్టమ్స్, సస్టెక్ ఇన్నోవేషన్స్, వి ట్రాన్స్‌ఫార్మింగ్స్, ఎయిర్‌నోటే తదితర సంస్థలు ఉన్నట్లు తెలిపారు. సుస్థిర పరిష్కారాలను రూపొందించే దిశగా వారి ప్రయాణంలో ఈ వినూత్న స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీ టీ హబ్ ఫౌండేషన్ సీఈఓ రాజేష్ అడ్డాతో పాటు పలువురు పాల్గొన్నారు.



కబీర్‌నగర్ నేతాజీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పళ్లు, తినుబండారాలు అందించిన అవంతినగర్‌తోట యువకులు ముకుంద అలియాస్ మురళి, తిరుపతి, శివ, రాము, రియాజ్, శశి, కిషోర్, తిరుమలేష్, మనోసాయి, ఆదిత్య, రాజేష్, నిఖిల్, హరికాంత్, ప్రదీప్.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

కూకట్‌పల్లిలో అనుమతులు లేని నిర్మాణాలు సీజ్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పలు భవనాలను బుధవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-5లోని ఎల్‌ఐజీ 718, కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని ఎల్ ఐజీ 81, కూకట్‌పల్లి వెంకటరావు నగర్‌లో భవనాలను సీజ్ చేయగా.. కేపీహెచ్‌బీ 15వ ఫేజ్ ఎంఐజీ 148, వివేకానందనగర్‌లో ప్లాట్ నంబర్ 98లో నిర్మాణంలో ఉన్న భవనాల్లో ఆక్రమణలను కూల్చి వేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లో సీజ్ చేసిన నిర్మాణం

బాలిక కిడ్నాప్.. గంటలోపే ఛేదించిన పోలీసులు

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో బాలిక కిడ్నాప్‌నకు గురైందని ఫిర్యాదు అందిన గంటలోపే పోలీసులు కేసును ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న కేసు వివరాలు వెల్లడించారు. రాయదుర్గం ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలిక స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చాక్లెట్ ఇస్తానని చెప్పి బైక్ ఎక్కించుకుని వెళ్లిపోయాడు. తన కూతురు స్కూల్ నుంచి ఇంటికి రాకపోవడంలో బాలిక తల్లి స్కూల్‌కు వెళ్లి విచారించింది. ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో బుధవారం సాయంత్రం 5 గంటలకు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఐదు టీంలుగా విడిపోయి సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసును ఛేదించారు. నిందితుడు బాలికను బైక్‌పైన ఎక్కించుకుని ఖాజాగూడ వైపు వెళ్తుండగా గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని బాలికను తల్లిచెంతకు చేర్చారు. నిందితుడిని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. నిందితుడు బాలికను ఎందుకు కిడ్నాప్ చేశాడనేది విచారణలో తెలిసే అవకాశం ఉందన్నారు.

సంప్రదాయ ఆహార పద్ధతులతోనే సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో పాల్గొన్న న్యూట్రిషన్ నిపుణులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయ ఆహార పద్ధతులే శ్రేయస్కరమని న్యూట్రిషన్ నిపుణులు స్పష్టం చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్), మిరాకిల్ మీ సంస్థలు సంయుక్తంగా 'మై ప్లేట్ ఫర్ ది డే' అంశంపై బుధవారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సదస్సును నిర్వహించాయి. సదస్సులో ప్రముఖ క్రీడా న్యూట్రిషనిస్ట్ డాక్టర్ కోటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. సంప్రదాయ ఆహారపు అలవాట్లను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ లక్ష్మితేజస్వి మాట్లాడుతూ.. జంక్ ఫుడ్స్ మానండి.. ఫ్యాన్సీ డైట్ నియమాలకు నో చెప్పండి' అని సభికులకు విజ్ఞప్తి చేశారు. సెప్టెంబరు 12 నుంచి 14 వరకు న్యూఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో జరుగనున్న గ్లోబల్ బయో ఇండియా ఈవెంట్‌కు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ మీ.. వ్యవస్థాపకులు మైత్రేయ్ మురళి, అర్బన్ కిసాన్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి రామ్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ తుమానీ న్యూట్రిషన్ నిపుణులు డాక్టర్ నిదా ఫాతిమా హజారీ, సైకాలజిస్టు లక్ష్మీ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడ ఎక్స్ రోడ్డులో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభం

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ఖాజాగూడ ఎక్స్‌రోడ్డులో హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (గ్రేటర్ హైదరాబాద్‌జోన్) మధుసూదన్, ఏటీఎం వెంకటనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కొరియర్, కార్గో, పార్శిల్ సౌకర్యాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సేవల కోసం 96522 67204లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రావణ్, ప్రదీప్, విజేందర్‌రెడ్డి, రమేష్, ఏజెంట్ సాహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశం

హైదర్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా డివిజన్లలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రజా అవసరాల కోసం ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని విద్యుత్ అధికారులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా అవసరాల దృష్ట్యా కొత్తసబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట స్థల సేకరణకు తన సహకారం ఉంటుందని తెలిపారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఎస్‌ఈ వెంకన్న, డీఈ రవికుమార్, ఏడీఈలు కమలాకర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, శ్యామ్‌ప్రసాద్, ఏఈలు వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రాంకీ ప్రతినిధులతో సమావేశం

నియోజకవర్గంలో పారిశుధ్య పనుల నిర్వహణ, సమస్యలు, భవన నిర్మాణ వ్యర్థాల తరలింపుపై రాంకీ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్య పనుల నిర్వహణ అలక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తకుప్పలు తొలగింపులో రాంకీ సిబ్బంది జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. శ్రీనివాస్‌యాదవ్, రాంకీ సంస్థ ప్రతినిధులు వైస్‌ప్రెసిడెంట్ హరికృష్ణ పాల్గొన్నారు.